సంఘానికి జంకి యీ యినుప త్రాళ్ళతో నిన్ను కట్టేస్తా ననుకున్నావా. పురుషునివలె స్త్రీకీ హక్కులున్నాయ్. ఆ హక్కులు యితర దేశాల్లో చెల్లుబడి కొచ్చాయ్. వారిలాగు మన దేశం కావాలంటె ఎన్నో యుగాలు దొర్లి పోవాలి. తీరని జబ్బుతో భర్తగా యుండేందుకు అనర్హుడినైనపుడు భర్తహక్కులు నాకెందుకు? ఈ శాస్త్రాల సలహాలు నాకెందుకు ... శారదా ఇవి నా తుదిమాటలు, నా ఆశీర్వాదాలు. మీ రిద్దరూ సుఖంగా సంసారం చేయండి. ఇంత కంటే నేను కోరేదేమీ లేదు. నీతో సౌఖ్యం అనుభవించే భాగ్యం నాకు లేకపోయినా నీ సౌఖ్యం గూడా నేనెందుకు భంగ పర్చాలి,”

అతడి చెక్కిళ్ళ మీద జారే కన్నీళ్లు ఆ కిటికీ వెలుతురుకు ముత్యాల్లా మెరుస్తున్నాయ్. ఆమె హృదయం కంపించి పోయింది. ఆమె అతడి దగ్గరకు చేరి పైట చెంగుతో కన్నీరు తుడుస్తూ ఓదార్పు మాటలు పలికింది. అతడికి ఆమాటలు వినిపించలేదు. అతడి ముఖంలోని గాంభీర్యం పైకుబికింది.

“లేదు శారదా. నీ జీవితాన్ని గురించే నాకు దుఃఖం కలిగింది. సున్నితంగా ఈ చెట్ల గాలులకు పెరిగిన నీ శరీరాన్ని గురించే నా మనో వ్యధ మరీ ఎక్కువైంది. ఈ సంఘం నిన్ను చిన్న చూపు చూస్తుందనే దుఃఖంతో కృశించి పోతున్నాను శారదా! సంఘం నిన్ను భయపెడుతుంది, పీడిస్తుంది. అదే దాని కర్తవ్యం. వీటన్నిటికి నీవు లొంగిపోయావంటే కళంకం ఏర్పడుతుంది. అదే నా బెంగ. నీవు సంతోషంగా ఎక్కడున్నా ఒకటే. అదే నా సుఖం, నా ఆనందం... అదే నామనోవ్యధకు దివ్యౌషధం” అన్నాడు అతడు ఆమె భుజంమీద చేయివేసి.

ఆమె తన పైటచెంగుతో కన్నీళ్ళను తుడిచి నప్పుడు అతడు అవ్యక్తమైన ఆనందాన్ని అనుభవించాడు. అతడు చెప్పవలసిన తుదిమాటలు చెప్పినందుకు మనస్సు శాంతి పడింది. కాని శారద హృదయంలో కల్లోలం రేగింది. అతడి మాటలు, చేష్టలు, అగ్నిజ్వాలల్లా ఆమెను ఆవరించాయ్. తన ఉద్దేశ్యాలు, ఊహాలు, నిప్పుమీద వెన్నలా కరిగి పోయాయ్. ఆమెను ఆవరించిన సంతాపం ఈనాటికీ ఆమెను దహిస్తూనే వుంది.

# అర్థంలేని ప్రయాణం

మా. సు. చక్రవర్తి

నాగపూర్‌కి ప్రయాణం. కూడా ఇంకెవరో ఉన్నారు. మగవాడే. ఎందుకు నాగపూర్‌కి? ఇంకేముందక్కడ? అర్థంలేని పని. అయినా తప్పనిసరి. ప్రయాణం ఆగదు, మారదు. సెలవు మీదనా ప్రయాణం? సరిగా తెలీదు. మరి ఇక్కడి ఉద్యోగం? ఉంది. దానికీ నాకూ లంకె.

స్టేషన్లో ఉన్నాం. నేను, అతడు. అతడు పాశ్చాత్య దుస్తుల్లో ఉన్నాడు. నేను? సరిగా తెలీదు. టికెట్ కొన్నాను. అంటే, కొనుక్కున్నాను. అతడు కొన్నాడో లేదో. కొనే ఉంటాడు. అతడూ నాగపూర్‌కే కదూ. ఔను. ఎప్పుడు కొనుక్కున్నాడో, టికెట్ కొనుక్కున్నాను. ఎందుకీ ఖర్చు? మానుకోకూడదూ? ఎంతడబ్బు! పోవలేదు. కొన్నాను టికెట్. ప్లాట్‌ఫారంమీద ఉన్నాం నేను, అతడు. అతడు సిగరెట్ కాలుస్తున్నాడు. నేను అటూ ఇటూ చూస్తున్నాను. అతడి దుస్తులు బాగున్నాయి. బండి ఎక్స్‌ప్రెస్సే కదూ? ఔను. నాగపూర్‌కి మరింకేంబండి? పెట్టెలో సామాన్లు పెట్టుకున్నాం. ఎవరు పెట్టారో తెలీదు. మేమిద్దరం మాత్రం ఇవతలే నిలబడి ఉన్నాం. పెట్టెవైపు చూస్తున్నాం. బండిలో దీపాలున్నాయి. రాత్రివేళా? ఎక్స్‌ప్రెస్ పగలు బయలుదేరేదేకదూ. దీపాలెందుకు? చీకటిగా ఉన్నట్టేఉంది. ప్లాట్‌ఫారంమీదంతా, బుక్‌స్టాల్‌లో, టికెట్ల కిటికీల దగ్గర దీపాలు

వెలుగుతున్నాయి. వాన లేదు. ఎక్స్‌ప్రెస్ పగలు బండే మరి. బండిలో జనం చాలతక్కువగా ఉన్నారు. ఏం! ఇంకా వేళకాలేదేమో.

ఎందుకీ ప్రయాణం. ఛా. నిజంగా పోను. ఎందుకు పోతాను! చూద్దాం ... అతడు నేను ఎక్కడికో వెళ్ళాం. కాఫీకో, తినడానికో, పుస్తకాలకో, ఎక్కడికో. ఎక్కడికైతే ఏం ప్లాట్‌ఫారంమీద కాసేపు లేము. వెళ్ళివచ్చాం. బండికి దగ్గరగానే ఉన్నాం. అయితే మా పెట్టెకు దగ్గరగా లేం. పెట్టె కనపడుతూనే ఉంది. ఎంతో దూరంగా లేం. మా పెట్టె, దాని పక్క పెట్టె మాత్రం కనపడుతున్నాయి. మిగత అంతా నల్లగా ఉంది. పెట్టెలు కావేమో.

జనం ఇంకా తక్కువగానే ఉన్నారు. ప్లాట్‌ఫారంమీద అసలు లేరు. బండిలో చాల తక్కువ మందే ఉన్నారు. ఇంకా వ్యవధి ఉందా? ఉందేమో. అతడు సిగరెట్ కాలుస్తూనే ఉన్నాడు. ఎప్పుడూ అదే చేస్తుంటాడు. నాతో మాట్లాడడు. నేనూ మాట్లాడడంలేదతడితో. ఎందుకో! అవసరం లేదేమో. అవసరం ఉంటే మాట్లాడుకోమూ!

ఇప్పుడు బండికి ఎడమవైపు ప్లాట్‌ఫారం మీద ఉన్నాం. ఇందాక కుడివైపు ఉన్నాం. ఎందుకు మారామో! ఈపక్కనుండి కూడా బండి ఎక్కవచ్చా? తోచలేదు. అసలు అటువంటి వీలుంటుందా? తోచలేదు... ఇందాకటి మాదిరిగానే బండికి దగ్గరగా ఉన్నాం కాని మా పెట్టెకు దగ్గరగా లేం. దగ్గరగా పోబోతున్నాం. బండి కదిలిపోబోతూ ఉంది. కూత కూసిందా? లేదు. గంటవినబడిందా? లేదు. గంటకొట్టారా? ఏమో. తోచలేదు. పెట్టె దూరమై పోతూ ఉంది.

అబ్బ! ప్రయాణం తప్పిపోయిందా... అబ్బే, లేదు. నా పెట్టె, పక్క, బండిలో ఉన్నాయి. అయ్యో బండి పోతూ ఉంది. పరుగెత్తుదాం రమ్మన్నాను అతడితో. 'అబ్బెబ్బే, బండి అప్పుడేపోదు, అట్లా వెళ్ళి- ఏమోచేసి- మళ్ళీ వస్తుంది. ఇక్కడికే' అన్నాడతడు. సిగరెట్టు కాలుస్తూనే ఉన్నాడు. బండెక్కడికి పోయి వస్తుంది? ఏంచేసివస్తుంది? ఎక్స్‌ప్రెస్ బండి ఇటువంటి పనులు చేస్తుందా. ఛఛ.

నాకు సందేహమే. వెనక్కి తిరిగిచూస్తే ఎవరో ఉద్యోగి కనబడ్డాడు. చేతుల్లో ఏదో జెండా ఉంది. 'ఏమండీ ఈబండి మళ్ళీ వస్తుందా' అన్నాను. 'అబ్బే మళ్లీ ఎందుకు వస్తుంది. ఐతే పరవాలేదు. మీ రింకో బండిలో వెళ్ళి రాజమండ్రిలో ఈ బండిని అందుకోవచ్చు'నన్నాడు రాజమండ్రిలో! ఎక్స్‌ప్రెస్ బండిని మళ్ళీ అందుకోడమా? మతిలేదా ఉద్యోగికి? రాజమండ్రిలో ఎక్స్‌ప్రెస్ ఎక్కి నాగపూరికి పోగలనా. అర్థంలేని ప్రయాణం, జరగదీ ప్రయాణం, అసంభవం ఈ ప్రయాణం. మరి సామాను ఎక్స్‌ప్రెస్‌లో పోయిందే!

నాతో ఉన్న అతడు కనబడలేదు. ఉద్యోగిని మళ్ళీ అడిగాను. నే నిప్పు డెక్కవలసింది బస్సా అని. ఆ మాటెందుకు అడిగానో! బస్సు ఎక్కి రాజమండ్రికి పోవడమా. ఎక్స్‌ప్రెస్‌కంటె ముందుగా పోవడమా! నాకూ పోయింది మతి. 'ఔను బస్సే కావలిస్తే రైలుకూడా ఎక్కవచ్చు. అయితే బస్సే మంచిది' అన్నాడు ఉద్యోగి. బస్సే మంచిదట! ఏమిటీ వెట్టి! లాభం లేదు. అయినా తప్పదు. మళ్ళీ మొదలు వెధవ ప్రయాణం వెధవ తిరుగుడు. నేనుపోను నిజంగా నేను పోవడంలేదు.

అయినా తప్పని సరి. వెళ్ళాను. ఆ బస్సె వచ్చింది. ఎక్స్‌ప్రెస్‌కంటె ముందువెళ్లే బస్సు ఎక్కాను! ఎక్కింది నే నొక్కడినే. అక్కడ స్టేషనులే దిప్పుడు. బస్‌కు స్టేషనెందుకు? నిజమే అవసరంలేదు. అందుకనే లేదు. అయితే రోడ్‌కూడా కనబడలేదు. నాకు కనబడకపోతే ఏం? రోడ్ ఉండకేమౌతుంది!

రైలుబండిలో జనంలేరు. ఈ బస్‌నిండా ఉన్నారు. ఆ రైలు తప్పిపోయినవాళ్లే వీళ్లంతా! అందరూ నామాదిరిగానే ఆ రైలును మళ్ళీ కలుసుకోడానికే ఈ బస్సెక్కారు. అయితే వాళ్ళకు తెలుసట రైలు తప్పిపోతుందని. అందుకనేనట బస్‌లోనే వస్తున్నారు! ఎక్కడినుండో? అయితే నాకూ పరవాలేదన్న మాట. నాకు మతిపోలేదన్న మాట. ఇంతమంది రైలు తప్పి బస్‌లో వస్తున్నారుగా. అందరూ ఆ ఎక్స్‌ప్రెస్ వలసినవారేగా. వాళ్ళందరూకూడా నాగపూరికే

నేమో. ఎందుకు అందరూ అక్కడికి? ఎందుకైతే నాకేం?

బస్‌లో దీపాలున్నాయి. బస్‌లో వాళ్లంతా మంచి దుస్తులు వేసుకున్నారు. అందరూ ఒకరితో ఒకరు మామూలుగా మాట్లాడుకుంటున్నారు. నాకు తప్ప, రైలు తప్పిందని చింత ఎవరికీలేదు... బస్‌లో కండక్టరున్నాడు. అతడు ఒక్కసారే కనబడ్డాడు నాకు. టికెట్ అడగలేదు నన్ను. ఎవ్వరినీ అడగలేదు. బస్ కొంచెం సేపే నడిచింది. మా బస్ సరియైన రోడ్ మీద నడుస్తున్నట్టులేదు. కుదపకంలేదైతే. ఏదో మెత్తటి అడ్డదారిన పోతూఉంది. బాగుంది. చల్లగాఉంది. చుట్టూ చెట్లు చేమలు పైర్లు ఆకాశం కనపడుతున్నాయి.

బస్ కొంచెంసేపే నడిచింది. పక్కకు చూడగా పెద్దరోడ్ కనబడింది. బస్ రోడ్ మీదికి పోబోయింది. ఇంతలో అక్కడ-ఆ రోడ్ మీద-ఇంకో బస్ కనబడింది. అందరూ చూచారు ఆ బస్‌ను నేనూ చూచాను. 'అదుగో ఎక్స్‌ప్రెస్. అదుగో మనబండి' అన్నారు అందరూ. ఆఁ! అదా ఎక్స్‌ప్రెస్! ఛ. రైలుబండి కదూ ఎక్స్‌ప్రెస్. వీళ్ళకు నిజంగా మతులులేవు, కాదు, అదే ఎక్స్‌ప్రెస్ అంటున్నారు. నేను వాళ్ళనడగలేదసలు. ఇటూ అటూ చూచాను. ఆబండివైపు చూచాను. బస్సే అది. దానిలోకి చూచాను. దానినిండా సామానుఉంది. లోపల ఎవరో ఒక్కమనిషే కూచోఉన్నాడు. నా పెట్టె పక్క కూడా ఉన్నాయి సామాన్లలో. అయితే అది ఎక్స్‌ప్రెసేనా...

నాపక్కన కూచున్న మనిషిని చూచాను. మొదట స్టేషన్లో నాతో ఉన్నతడే అతడు. బస్సెప్పుడెక్కాడు? ఎప్పుడో. నాకంటె ముందా? ఔనేమో...

మా బస్ రోడ్డెక్కింది. వేగం ఎక్కువైంది. ఎక్స్‌ప్రెస్ వెనకపడింది. కనబడలేదు. మేం ముందుకు వెళ్ళాం. ఎందుకు? ఎక్స్‌ప్రెస్‌ను కలుసుకోడానికి ముందెక్కడో తయారుగా ఉండడానికి! ఇప్పుడు కలుసుకోలేదూ? ఇప్పుడే దానిలోకి మారకూడదూ?

ముందెక్కడో ఆగిపోంటాం. ఆగకేమాతాం. ఎప్పుడో ఎక్కడో నాకు తెలీదు. ఇప్పుడా బస్ లేదు. ఆమనుషు లెవరూలేదు. నేను ఎక్స్‌ప్రెస్‌లో ఉన్నాను. ఇదీ బస్సే ఇందాక దీనిలో ఉన్న ఆ ఒక్కమనిషికూడా లేడు. ఆ ప్రయాణీకులందరూ ఏమైనట్టు? వాళ్ళు ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళవలసినవారే కదూ. అయితే నేనున్నది ఎక్స్‌ప్రెస్ కాదూ-కాకపోవడమేం? నేను ఎక్స్‌ప్రెస్‌లో పెట్టిన నా సామాను దీనిలో ఉందిగా.

కండక్టరు దగ్గిరికివచ్చాడు. క్రిందటి బస్ కండక్టరు మాదిరిగానే ఉన్నాడితడు 'ఏమ'న్నాను. 'టికెట్' అన్నారు. 'టికెట్టెందుకు' 'నాకు ఎక్స్‌ప్రెస్ టికెట్టుంద'న్నాను. 'దానికి దీనికి సంబంధం లేదు' నవ్వుతూనే అన్నాడు. 'అది గాదండీ ఇందాకటి మీరు బస్‌లో ప్రయాణం చేసినందుకు డబ్బివ్వండి' అన్నాడు. సరే నన్నాను ఆలోచిస్తూ 'మరి వాళ్లందరేరీ' అనడిగాను. 'వెళ్ళిపోయినార'న్నాడు 'ఎక్కడికి? నాగపూరికా? ఎప్పుడు? దేనిమీద?' అనడిగాను. 'ఏమోనండీ కొందరు నాగపూరికి, కొందరింకో చోటికి, మరి కొందరింకో చోటికి, అందరూ ఆ దారిన వెళ్లేవాళ్లే' నన్నాడు. 'మరి నేనూ నాగపూరికి పోవాలే- నేనూ టికెట్ అక్కడికి కొనుక్కున్నానే' అన్నాను. 'మరి వాళ్ళతో ఎందుకుపోలేద'న్నాడు. 'ఇది నాగపురికి పోదా' అన్నాను. నవ్వుతూ 'నాగపూరికెందుకు పోతుందండీ. నాగపూరికైతే వాళ్ళతో దానిలో పోవలసింది మీరు. 'పోనీ మీ సామానంతా ఉందా చూసుకో'మ'న్నాడు. చూచుకున్నాను. ఈపక్క నాదే. పెట్టెకూడా నాదే. పెట్టెను రెండుమూడుసార్లు తట్టి చూచుకున్నాను.. ఏమిటిదంతా...

చేతికి చల్లగా గట్టిగా ఏదో తగిలింది. కొంచెం చప్పుడుకూడా అయింది. మెళుకువ వచ్చింది. నా మంచంకింద పెట్టె చేతికి తగులుతూఉంది. లేచి కూచున్నాను, ఇంట్లోనే ఉన్నాను. ఔను. ఎక్కడికిపోతాను! నాగపూరికి పోతానా? సగం ప్రయాణం చేశానా! నవ్వుకున్నాను. ఏముంది నాకోసం నాగపూర్‌లో? సర్దుకొని మళ్లీ పడుకున్నాను.

(8వ పేజీ తరువాయి)

నువు తెర ఎత్తటమే సరి అయిన చోట ఎత్త లేదనీ, ముందు దక్షిణ కొరియావాళ్లు ఉత్తర కొరియావైపు పోవటం చూపనేలేదనీ విమర్శిస్తున్నారు'-

క్లోజప్-అమెరికా - కోపంగా-'ఆ నాటకం ఉత్తర కొరియా దురాక్రమణతోనే ప్రారంభమవుతుంది - ప్రొడ్యూసరును నేనా, ఆ ప్రేక్షకులా?-నా నాటకాన్ని ధ్వంసం చెయ్యమని ఆ రష్యాయే ఉత్తర కొరియనులకు ఆదేశాలిస్తోంది-ప్రేక్షకుల కీసంగతి చెప్పేస్తే మంచిది'-

క్లోజప్-బ్రిటన్-'ప్రేక్షకులీ అంకంలో యాక్షనంతా తప్పుగా ఉందంటున్నారు-ఉత్తర కొరియా వాళ్లతో పోట్లాడేది ఐక్యరాజ్య సైన్యాలంటివి, అందరూ అమెరికావాళ్ళే కనిపిస్తున్నారేమంటున్నారు-ఈ అంకంలో అమెరికా సైన్యాలు ఉత్తర కొరియావాళ్ళని గెలుస్తాయని బిల్లుల్లో చెప్పావు, రంగంమీద అది కనిపించటం లేదంటున్నారు'-

క్లోజప్-అమెరికా-'ఈ అంకం ఎంత పొడుగుందో ప్రేక్షకుల కేం తెలుసును? - కాస్త ఆగితే నేను చెప్పినట్టే నడుస్తుంది-ఈలోగా కొన్ని జాగర్తలు పడదాం-ఎవడ్రా, అక్కడ?-ఒరే నువు వెళ్ళి మన లైట్ బోయి మాక్‌తో స్టేజిమీద దీపాలు చాలాభాగం ఆర్పమను-ఐక్యరాజ్య సమితి తరఫున పోట్లాడేవాళ్ళకు ఐక్యరాజ్య చిహ్నాలు తగిలించమను'-

క్లోజప్-బ్రిటన్ - స్టేజిలోకి చూస్తూ-'ఇక ముందు నాటకం కాస్త రక్తి కట్టొచ్చు'-మొహానమాత్రం ఆశ కనిపించదు-

క్లోజప్-అమెరికా-'ఎందుకు రక్తి కట్టదు? నేను నాటకం ఆడించటమూ, అది రక్తి కట్టక పోవటమూనా? రష్యా నా నాటకాన్ని భగ్నం చెయ్యటానికి చూస్తున్నది. ఈమాట నువ్వు ప్రేక్షకులకు తెలియజెయ్యి'-

క్లోజప్-బ్రిటన్-'సాక్ష్యం?-'

క్లోజప్-అమెరికా-'నీ లాయరు బుద్ధిమూస్తే నాకు మండుకొస్తుంది. సాక్ష్యం ఉందంటే సరిపోదా? నాటకం చూసే ప్రేక్షకులు స్టేజిమీదికెక్కి చూడొచ్చారా?'-

క్లోజప్-బ్రిటన్-'రష్యా, పోనీ, ఈ ప్రాంతాల ఎక్కడన్నా ఉంటే-'

క్లోజప్-అమెరికా - “ప్రేక్షకుల్లో రష్యా సీటు ఖాళీగా ఉంటేనేం గనక తెరవెనక ఉండే ఉంటుంది. మనలాగే ఈ కమ్యూనిస్టు దేశాలూ తెరవెనక భాగోతం. ఇంకా మనమే నయం. కొంత భాగోతం తెరముందుకూడా ఆడతాం.

క్లోజప్-ఫ్రాన్సు-“అదుగో, రష్యా! ప్రేక్షకుల్లో అధ్యక్షపీఠం అలంకరించటానికివచ్చింది-”

క్లోజప్-అమెరికా, బ్రిటను - “ఆఁ!”-బ్రిటను-“ఇప్పుడేమిటి? ఈ నాటకం సరిగా సాగేనా?” - అమెరికా - “నువ్వు నిశ్శబ్దంగా ఉండు నేను చూస్తాను”-మిక్స్.

లాంగ్ షాట్-అమెరికా, బ్రిటను, ఫ్రాన్సులు సైడ్ వింగ్ లోనుంచి ఆత్రంగా చూస్తున్నారు-బ్రిటన్-“నాకీ అంకం ఏమీ బాగాలేదు. నువు చెప్పినట్టు వినడంలేదు - నీ సైన్యాలు తోక ముడిచి పారిపోతున్నాయి-నీ విమానదాడులు నాగరిక మానవచరిత్రలో—”

క్లోజప్-“నా సైన్యాలు కావు-ఐక్యరాజ్య సేనలు! యుద్ధం ఎట్లా చెయ్యాలో మాక్ చూస్తాడు-మనం దానికి కర్తలంకాం - కాక పోయినా ప్రేక్షకులు మనం చూసేదంతా చూడలేరు-మాక్ దీపాలు తగ్గించాడు గదా!”

క్లోజప్ - బ్రిటన్ - “రంగంమీద రిపోర్టర్లున్నారు-నిజం దాగదు—”

క్లోజప్-అమెరికా-“నా కెవ్వరి భయమూ లేదు-నా అసిస్టెంట్లు వీరంటే అసలే భయం లేదు - నన్నడిగేదెవరు-నాటకం ఎట్లా ఆడిస్తే మటుకు?—”

క్లోజప్-బ్రిటన్ - “నీకు ఎవరి సదభిప్రాయమూ అక్కర్లేదా?”

క్లోజప్ - అమెరికా- “పాము కప్పల సదభిప్రాయం కోరుతుందా?” ఇన్ సర్టు-బ్రిటనూ, ఫ్రాన్సూ ఒకరిమొహం లొకరు చూసుకుంటారు-

లాంగ్ షాట్ - అమెరికా ప్రతినిధి సైడ్ వింగ్స్‌లోకి వస్తూ కనిపిస్తాడు-అమెరికా అతని దగ్గిరికి వెళుతుంది-ఇద్దరూ రహస్యంగా ఏదో మాట్లాడుకుంటారు-

క్లోజప్-బ్రిటన్ ఫ్రాన్సులు-బ్రిటన్-"ఏదో పెటకం ఆలోచిస్తున్నది అమెరికా!"-ఫ్రాన్స్-"మనం నిస్సహాయులం"-కొమెరా వెనక్కు పోతుంది-అమెరికా తృప్తిగా చేతులు రుద్దుకుంటూ ఒకవైపునుంచి ఫీల్డులోకి వస్తూ-"ఇక చూడండి, తమాషా"-మిక్స్-

మిడ్ క్లోజప్-అమెరికా, బ్రిటనూ, ఫ్రాన్సూ సైడ్ వింగ్ లోనుంచి రంగాన్ని తిలకిస్తున్నాయి - ముగ్గురి మొహాలూ వివర్ణంగా ఉన్నాయి-బ్రిటను-తనలో తాను మాట్లాడుకుంటున్నట్టుగా - "ఇటువంటి నాటకం నేనెక్కడా చూడలేదు-కొరియా రంగమంతా బాంబులతో పిండిపిండి అయింది-దానిమీద అంతులేని కొరియన్ రక్తం ప్రవహించి రొంపి తయారయింది-రొంపిలో అమెరికా సైనికులు దిగబడి చచ్చిపోతున్నారు-వీళ్ళీ ఊబిలోనుంచి పైకి వచ్చేమాట అబద్ధం-"

క్లోజప్-అమెరికా-అరుస్తూ- "వీళ్ళంతా కొరియావాళ్లు కారు - ఇందులోకి చైనావాళ్ళెట్లా వచ్చారు?-నా తడాఖా చూపిస్తా"-

క్లోజప్-బ్రిటన్-"నీ సైనికులు చైనా సరిహద్దు కెందుకు వెళ్ళాలీ? ఇండియా ప్రతినిధి ఇందాక ఈ దిక్కుమాలిన నాటకాని కడ్డొచ్చాడు - మీ లైట్ బోయ్ విన్నాడా? నువు విన్నావా? వాళ్ల సరిహద్దు రక్షించుకోలేరూ?"

క్లోజప్- అమెరికా- "ఎవడ్రా అక్కడ?- వెళ్లి ఆ చైనా సైనిక పాత్రల్ని రంగంమీది నుంచి పంపమని చెప్పు- నేను చెప్పానని చెప్పు-"

క్లోజప్ - బ్రిటన్ - "అవును, నీ కాంప్లిమెంటరీ టికెట్టువాడి మాట ఆ సైనికులు వింటారు!- ఏమిటి నీ చాదస్తం? నేను మొదటి నుంచీ వద్దువద్దని నెత్తీ నోరూ బాదుకుంటూనే ఉన్నా. వింటావా?"-

క్లోజప్ - అమెరికా - "అట్లా అంటావేం, బ్రిటన్? చైనా దురాక్రమణ చేస్తున్నది! కనపట్టంలా?"-

క్లోజప్ - బ్రిటన్- "కనపట్టంలా! ఉత్తర కొరియా వచ్చి నీతో మొరపెట్టుకున్నదా?"-

క్లోజప్ - అమెరికా-"దురాక్రమణ ఎక్కడ జరిగినా సహించేదిలేదు - తప్పకుండా ఈ రంగంలో అణువు బాంబులు వేసేదే"-

క్లోజప్ - బ్రిటన్, ఫ్రాన్సులు - తెల్లబోయి చూసి, వెనక్కుతిరుగుతారు-అమెరికా గొంతు "ఎక్కడికి?" బ్రిటన్ - వెనక్కు తిరిగి - ఈ నాటకంతో మాకు సంబంధంలేదు - మేం పోతాం నీ యిష్టం వచ్చినట్టు ఆడుకో నీ నాటకం!"-

క్లోజప్- అమెరికా-"మాటవరసకన్నాను - నిజంగా అణువుబాంబు వేస్తాననా?" బ్రిటన్ - ఫ్రాన్సులు తిరిగి ఫీల్డులోకి వస్తాయి-అమెరికా- "చైనామీద యుద్ధం ప్రకటిద్దాం!"

క్లోజప్ - బ్రిటన్- "వల్లగాదు!"-

క్లోజప్ - అమెరికా- "అదేం?"

క్లోజప్-బ్రిటన్-"నీకు తెలీదు, మమ్మల్ని చెప్పనీవు. ఇదుగో చర్చిల్ పంపించిన ఉత్తరం. ఉన్న టపాకాయలన్నీ ఈ రంగంలోనే పేల్చేస్తే, అసలు యూరప్ రంగంలో ఏం ఉపయోగిస్తావు?"

క్లోజప్ - అమెరికా-"ఈ రంగం తగలేశావని అప్రతిష్ట తెచ్చుకోమన్నావా?"-

క్లోజప్ - బ్రిటన్-ఏదో విధంగా ఈ రంగంలో యాక్షన్ ముగించు - ప్రతిష్ఠ సంగతి తరవాత చూద్దాం"-

క్లోజప్- అమెరికా-"చైనామీద యుద్ధం? బ్రిటన్ గొంతు- "మాట్లాడరాదు!" - అమెరికా - "సరే అయితే అసలు రంగానికి సన్నాహాలు సాగించండి - నేనీ రంగం ఏదో ఒక దరికి తెచ్చి తెర వేయిస్తాను"-

క్లోజప్ - ఫ్రాన్స్- బ్రిటన్ చెవిలో - "నా మాట విను. ఈ కొరియా రంగాన్ని ముగించే కీలకం చైనా చేతిలో ఉంది - చైనా ఈ రంగం మీద తెర పడనివ్వదు - చూస్తూ ఉండు!"-

బ్రిటన్ ఫ్రాన్సుకేసి సాలోచనగా చూస్తూ "ఛీ, ఛీ! ఏం నాటకమిది? ఇందులో నువ్వూ నేనూ ఎట్లా ఇరుక్కున్నాం?" బ్రిటన్ - ఫ్రాన్సులు ఒకరి మొహం ఒకరు చూసుకుంటుండగా - స్లో ఫేడౌట్.